సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 11 । జూన్ । 2023



ఆక్వా యోగా

విశాఖ: యోగా దినోత్సవ సందర్భంగా నేవీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 10 వరకు ప్రత్యేక ఆక్వాటిక్ సెషన్ నిర్వహించారు.



జాతీయ సమైక్యత శిబిరం

విశాఖ: అస్సాం రాష్ట్రంలో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరంలో ఏయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



వాణిశ్రీకి గౌరవ డాక్టరేట్

విశాఖ: గీతం యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ప్రముఖ నటి వాణిశ్రీకి గౌరవ డాక్టరేట్ (డీలిట్)ను అందజేశారు.

న్యూస్‌రీల్

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శేషసాయికి స్వాగతం



జస్టిస్ శేషసాయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట (విశాఖ): రాష్ట్ర హైకోర్టు యాక్టింగ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి ఒక రోజు పర్యటన నిమిత్తం శనివారం విశాఖ చేరుకున్నారు. ప్రభుత్వ సర్క్యూట్ హౌస్ వద్ద కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జస్టిస్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

అప్పన్నను దర్శించుకున్న తెలంగాణ గవర్నర్ తమిళిసై



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న తమిళిసై

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాత్రి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.


వడ్డాది విద్యార్థికి గోల్డ్ మెడల్



యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ అందుకుంటున్న సంజయ్‌కుమార్

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదికి చెందిన అంగన్‌వాడీ టీచర్ ఎలిశెట్టి అమ్మాజీ కుమారుడు ఎలిశెట్టి సంజయ్ కుమార్ ఎం ఫార్మసీలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఛండీఘర్ యూనివర్సిటీలో ఎం ఫార్మసీ చేసిన సంజయ్ కుమార్ యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. శుక్రవారం రాత్రి జరిగిన యూనివర్సిటీ వార్షికోత్సవంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, వైస్ ఛాన్సలర్ సతనం సింఘ్ సాంధ్, ప్రొఫెసర్ విమల అరోరా తదితరుల చేతుల మీదుగా సంజయ్ కుమార్ గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందుకున్నాడు.

మట్టి నమూనా పరీక్షలతో భూసారం పెంపు



కేవీకే నుంచి ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా సలహాలు అందిస్తున్న శాస్త్రవేత్తలు

బుచ్చెయ్యపేట: మట్టి నమూనాలు చేసుకోవడం ద్వారా భూమిలో ఖనిజ లవణాల లోపాలు తెలుసుకుని, దాన్ని సారవంతంగా మార్చుకోవచ్చని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త కె. రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం కేవీకే నుంచి జిల్లాలోని పలు గ్రామాల రైతులకు మల్టీ లొకేషన్ ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా భూసారం, పంట దిగుబడిపై పలు సూచనలు, సలహాలు అందించారు. వేసవిలో భూమిని లోతుగా దుక్కులు చేయడం వల్ల కలుపు నివారించి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. శాస్త్రవేత్తలు పి.సత్తిబాబు, జి.తిరుమలరావు, వెంకటరాము పాల్గొన్నారు.

బడి బస్సు బాగుంటేనే..

- ఫిట్‌నెస్ ఉంటేనే ధ్రువీకరణ పత్రం
- విద్యాసంవత్సరం ఆరంభంలోపే సామర్థ్య పరీక్షలు
- అనుమతి లేకుండా రోడ్డు మీదకొస్తే చర్యలు
- బడి బస్సుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దంటున్న అధికారులు



బస్సు ఫిట్‌నెస్ పరీక్ష చేస్తున్న అధికారులు



స్కూలు బస్సు నడుపుతూ ఫిట్‌నెస్ తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారి

అనకాపల్లి రూరల్: విద్యా సంస్థల బస్సుల సామర్థ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈనెల 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. విద్యార్థులను తీసుకెళ్లి, వదిలే పాఠశాలల బస్సుల కండిషన్ బాగుండాలని రోడ్డు రవాణా శాఖ అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో నిబంధనలు పాటించని స్కూలు బస్సులపై ఆర్‌టీవో అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ పరీక్షలు చేసి ధ్రువపత్రం ఇస్తున్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రోడ్డెక్కితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో 472 స్కూల్ బస్సులు ఉండగా 345 బస్సులకు అధికారులు పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. మిగిలిన బస్సులకు కూడా గడువులోగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

జిల్లా వ్యాప్తంగా స్కూలు బస్సులకు గతంలో జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల గడువు గత నెల 14వ తేదీతో ముగిసింది. పాఠశాలలు పునః ప్రారంభమైతే ఈ బస్సుల్లో నిత్యం వందలాది మంది విద్యార్థులు స్కూళ్లకు, ఇళ్లకు రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నారుల చదువుతోపాటు భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. చిన్నారుల భద్రతకు పూర్తి భరోసానివ్వాల్సిన బాధ్యత విద్యా సంస్థల యాజమాన్యాలపైనే ఉంది. కాలం చెల్లిన బస్సులతో విద్యార్థులకు ముప్పు ఉంటుందని పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోపు ప్రైవేటు విద్యా సంస్థలు బస్సుల సామర్థ్యంపై పరీక్షలు చేయించుకుని ధ్రువీకరణ పొందితేనే రోడ్డెక్కాలని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో అనకాపల్లి జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి ఫిట్‌నెస్ పరీక్ష కోసం స్కూలు బస్సులు క్యూ కడుతున్నాయి. అధికారులు రోజుకు 10కి పైగా బస్సులను పరీక్షిస్తున్నారు. నిబంధనలు పాటించని బస్సులకు లోపాలను గుర్తించి వెనక్కు పంపిస్తున్నారు. 15 ఏళ్లు పైబడిన వాహనాలు తుక్కు కింద వెళ్తాయని అధికారులు చెబుతున్నారు.

తనిఖీల్లో వెలుగు చూసిన విషయాలు


- విద్యార్థులు బస్సులోకి ఎక్కే మెట్లు సరైన ఎత్తులో ఉండడం లేదు.
- అత్యవసర ద్వారం వెంటనే తెరుచుకోవడంలేదు.
- టైర్లు సరిగా ఉండడం లేదు. హ్యాండ్ బ్రేక్ పనిచేయడం లేదు.
- సీట్లు సక్రమంగా ఉండడం లేదు.
- స్టీరింగ్ సరిగా తిరగడంలేదు. బ్రేకులు వేసినపుడు పెద్దగా శబ్దం వస్తోంది.

నిబంధనలు ఇవీ..

- వేగ నియంత్రణకు ప్రతి బస్సులోనూ కచ్చితంగా స్పీడు గవర్నర్లు ఉండాలి.
- స్కూలు బస్సుల వేగం గంటకు 60 కిలోమీటర్లు మించరాదు.
- ప్రతి బస్సులోనూ మంటలనార్పే పరికరం, ప్రథమ చికిత్స బాక్సులో అత్యవసర వైద్య సామగ్రి తప్పనిసరిగా ఉండాలి.
- ప్రతి బస్సుకూ వెనుక అత్యవసర ద్వారం ఉండాలి.
- ప్రతి బస్సుకూ అద్దాలతోపాటు ఇనుప గ్రిల్స్ ఉండాలి.
- విద్యార్థులు బస్సు ఎక్కేందుకు, దిగేందుకు సహాయకుడు ఉండాలి.
- బస్సు డ్రైవర్ వయస్సు 60కి మించకూడదు. ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- బస్సులో విద్యార్థులు ఏం చేస్తున్నదీ డ్రైవర్‌కి కనపడేలా మిడిల్ అద్దం ఉండాలి.

జిల్లాలో మొత్తం స్కూల్ బస్సులు	తనిఖీలు పూర్తయినవి
472	345

ప్రమాణాలు పాటిస్తేనే ఫిట్‌నెస్



విద్యాసంస్థల వాహనాలన్నీ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. వాహన సామర్థ్య పరీక్ష ధ్రువపత్రం లేకుండా వాహనాలు రోడ్డెక్కితే వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేస్తాం. భారీగా జరిమానాలు విధిస్తాం. పిల్లల విషయంలో యాజమాన్యాలు అలసత్వం వహించరాదు. పాఠశాలలు తెరిచేలోపు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి.

–కె.వి.ప్రకాశరావు, జిల్లా రవాణా శాఖాధికారి

రైతు పక్షపాత ప్రభుత్వమిది



పెదనందిపల్లి ఆర్బీకేలో రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- పెదనందిపల్లిలో వరి విత్తనాల పంపిణీ

దేవరాపల్లి: తొలకరికి ముందే విత్తనాలను అందజేసి రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోందని, తమ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని పెదనందిపల్లిలో రాయితీపై సరఫరా చేసిన వరి, పచ్చి రొట్ట విత్తనాలను ఆయన శనివారం అన్నదాతలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతల చెంతకే విత్తనాలు సరఫరా చేస్తున్న ఘనత దేశం మొత్తం మీద సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విత్తనాల కోసం మండల కేంద్రాల్లో మండుటెండలో గంటల తరబడి భారీ క్యూలైన్లలో రైతులు నిరీక్షించవలసి వచ్చేదని, నానా అవస్థలు పడే వారని చెప్పారు. తమ ప్రభుత్వంలో విత్తనాల కోసం గ్రామం దాటి వెళ్లాల్సిన అవసరం రైతులకు లేదని చెప్పారు. ఆర్బీకేల్లో నచ్చిన విత్తనాలు పొందే అవకాశాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని తెలిపారు. ఖరీఫ్‌లో సాగు పెట్టుబడి నిమిత్తం వారం రోజుల క్రితమే రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేశారన్నారు. వ్యవసాయాన్ని లాభసాటి చేయడమే లక్ష్యంగా అన్నదాతలకు అన్ని విధాలుగా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. రైతులందరికీ పారదర్శకంగా ఖరీఫ్ వరి విత్తనాలు అందజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభం

అనంతరం పెదనందిపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్, ఎం.అలమండలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన భవనాల్లో ప్రత్యేక పూజలు జరిపి, శిలాఫలకాలు ఆవిష్కరించారు. డిప్యూటీ సీఎంకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను అందిస్తూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, మండల మహిళా అధ్యక్షురాలు, పెదనందిపల్లి ఎంపీటీసీ రొంగలి నారాయణమ్మ, సర్పంచ్ సోమిరెడ్డి సన్నిబాబు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రాకుల గంగాభవాని, ఎంపీడీవో సీహెచ్.సుబ్బలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ, ఏఈవో ఎస్.కిరణ్‌కుమార్, ఎం.అలమండ సర్పంచ్ దాడి జగన్, ఎంపీటీసీ పోతల వెంకటరావు, మాజీ సర్పంచ్ పోతల లక్ష్మి, పీఆర్ డీఈఈ టి.రమణ, ఏఈ కె. ఉమామహేశ్వరరావు, వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి బి. హారిక, ఇంచార్జ్ ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని పాల్గొన్నారు.



గ్రామ సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

భగ్గుమన్న సూరీడు

- వడగాడ్పులతో జనం బెంబేలు
- అనకాపల్లి, చోడవరం పట్టణాల్లో 43 డిగ్రీలు నమోదు
- రాత్రి 7 గంటలైనా తగ్గని వేసవి తాపం



చిన్నారితో మండుటెండలో..



జనసంచారం లేక నిర్మానుష్యంగా ఉన్న చోడవరం మెయిన్‌రోడ్డు


చోడవరం/అనకాపల్లి టౌన్: ఎండలు ఉగ్రరూపం దాల్చడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. వడగాడ్పులకు సొమ్మసిల్లిపోతున్నారు. ఉదయం 8 గంటలు దాటేక ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. పరిస్థితి అప్రకటిత కర్ఫ్యూను తలపిస్తోంది. గత మూడు నాలుగు రోజులుగా దడ పుట్టిస్తున్న ఎండ శనివారం మరింత భగ్గుమంది. అనకాపల్లి, చోడవరం పట్టణాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. పెరిగిన ఉష్ణోగ్రతకు వడగాడ్పులు తోడవ్వడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. రోజువారీ కార్మికులు, ఉపాధి పథకం కూలీలు ఈ రోజు పనులన్నీ నిలిపివేశారు. నిత్యం జనంతో రద్దీగా ఉండే అనకాపల్లి నెహ్రూచౌక్ ప్రాంతం, చోడవరం పట్టణంలో ఉదయం 10 గంటలకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వడదెబ్బకు, ఉష్ణతాపానికి గురై పలువురు ఆస్పత్రుల్లో చేరారు. రాత్రి 7 గంటల వరకు వడగాలులు వీస్తూనే ఉన్నాయి. చిన్న పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

అనకాపల్లి విలవిల

గత వారంరోజులుగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు శనివారం మరింత పైకి బాకాయి. అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో గురువారం 40.8, శుక్రవారం 42.5, శనివారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ప్రజలు నానా అవస్థలు పడ్డారు. రుతుపవనాలు ఎంత త్వరగా మన ప్రాంతంలో ప్రవేశిస్తాయా.. అని ఎదురుచూస్తున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని రిక్షా, భవన నిర్మాణ కార్మికులు పనులకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. వారు చెట్ల కింద సేద దీరుతూ కనిపించారు. జనం కూల్‌డ్రింకులు, ఫ్రూట్ జ్యూస్, కొబ్బరి బొండాలను ఆశ్రయించారు.

లోన్‌యాప్ ఉచ్చులో గ్రామీణ మహిళ

రూ.3 లక్షల రుణం ఆశ చూపి రూ.21,500కు టోకరా



బాధితురాలి నుంచి వివరాల సేకరణ

కోటవురట్ల: లోన్‌యాప్ నిర్వాహకుల ఉచ్చులో మహిళ చిక్కుకున్న ఘటన కోటవురట్లలో చోటుచేసుకుంది. స్థానిక దిశ పోలీసులు శనివారం అందించిన వివరాలు.. కొన్నిరోజుల క్రితం బాధితురాలు సీతకు ధనిబ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నామంటూ ఫేక్ కాల్ చేసి రూ.3 లక్షలు రుణం ఇస్తామని నమ్మబలికారు. లోన్ ప్రోసెస్ కింద మొదట రూ.6,500 ఆన్‌లైన్‌లో కట్టించుకున్నారు. వివిధ ఫీజుల రూపంలో రూ.15 వేలు వసూలు చేశారు. దీంతో అనుమానం వచ్చిన బాధితురాలు సీత సదరు బ్యాంకుకెళ్లి ఆరా తీసింది. బ్యాంకు నుంచి ఎటువంటి లోన్‌కాల్స్ చేయలేదని సిబ్బంది తెలపడంతో మోసపోయినట్లు గ్రహించి, దిశ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు బాధితురాలి నుంచి వివరాలు సేకరించి విచారణ చేపడుతున్నారు. లోన్‌యాప్ నిర్వాహకులకు సంబంధించిన సెల్ నంబర్, అకౌంట్, ఇతర వివరాల ఆధారంగా నిందితులను పట్టుకుంటామని పోలీసులు చెప్పారు.

నర్సీపట్నం అభివృద్ధికి కృషి



మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ

నర్సీపట్నం: మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి చెప్పారు. చైర్‌పర్సన్‌గా సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్‌గా కోనేటి రామకృష్ణ ఎన్నికైన తర్వాత శనివారం లాంఛనంగా మున్సిపల్ కార్యాలయంలోని తమ చాంబర్లో ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు తొలి ప్రాధాన్యమిస్తానని తెలిపారు. కొద్ది రోజుల్లో ఈ-ఆటోలు రానున్నాయని, వీటితో చెత్త తరలిస్తూ 28 వార్డుల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తానన్నారు. వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండేటట్లు చూస్తానన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానన్నారు. రాజకీయాలకతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేస్తానని చెప్పారు.

వారణాసి రైలు పొడిగింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): విశాఖపట్నం-వారణాసి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలును మరో రెండు వారాల పాటు పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-బెనారస్ (08588) వీక్లీ స్పెషల్ రైలు (ప్రతీ బుధవారం) ఈనెల 21, 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో బనారస్-విశాఖపట్నం (08587) వీక్లీ స్పెషల్ (ప్రతీ గురువారం) ఈనెల 22, 29 తేదీల వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

పోస్టులు భర్తీ చేయాలని వినతి

రోలుగుంట: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 4,765 ఏనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి నిరుద్యోగులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని రొంగలిపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగించుకుని వెళ్తున్న ఆయన్ను కలిసి విన్నవించారు. ఏనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ ఉద్యోగాల కోసం తాము ప్రైవేటు శిక్షణ పొంది మూడేళ్లవుతుందని, ప్రభుత్వం క్లస్టర్ విధానంలో పోస్టింగులు భర్తీ చేయడం వల్ల ఖాళీ పోస్టులు మరుగున పడుతున్నాయన్నారు. దీని వల్ల శాశ్వత నిరుద్యోగ సమస్య తలెత్తే ప్రమాదముందని వాపోయారు. పాత విధానం(ఏహెచ్‌ఏ) కొనసాగించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కేంద్ర హోంమంత్రి పర్యటనకు భారీ భద్రత

950 మంది అధికారులు, సిబ్బందితో బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి (విశాఖ): కేంద్ర హోం మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనకు నగర పోలీస్ శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతోంది. ఆదివారం ఆయన విశాఖలో పర్యటించడంతో పాటు రైల్వే గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో నలుగురు డీసీపీలు, రెండు ఏపీఎస్పీ ప్లటూన్లు, 4 స్పెషల్ పార్టీలతో మొత్తంగా 950 మంది అధికారులు, సిబ్బందితో బందోబస్తు కల్పిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ శనివారం సమావేశం నిర్వహించి బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమిత్ షా పర్యటించే ప్రాంతాలైన ఐఎన్ఎస్ డేగ, ఎయిర్‌పోర్ట్, వాల్తేరు రైల్వే గ్రౌండ్స్, బస చేసే పోర్ట్ అతిథి గృహం, సాగర్ మాల కన్వెన్షన్ సెంటర్ వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాలతో పాటు బహిరంగ సభ జరిగే రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

బహిర్భూమికి వెళ్లిన వ్యక్తికి విద్యుత్ షాక్



ప్రమాదంలో మృతి చెందిన నాగేశ్వరరావు

యలమంచిలి: విద్యుత్ షాక్ గురై ఓ వ్యక్తి మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన కలిగట్ల నాగేశ్వరరావు (22) శుక్రవారం రాత్రి యలమంచిలి మండలం పులపర్తి గ్రామంలో స్నేహితుడు శివలంక రామకృష్ణ వివాహ వేడుకకు వచ్చాడు. పులపర్తి రోడ్డు శివాలయం గుడి సమీపంలో బహిర్భూమికి వెళుతూ ఒక చెట్టు మీదుగా 11 కేవీ హైటెన్షన్ కరెంట్ ప్రవహిస్తున్న చెట్టు కొమ్మను పట్టుకున్నాడు. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై నాగేశ్వరరావు మృతి చెందినట్టు మృతుడి భార్య తులసి ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు. వీరు ప్రస్తుతం రాంబిల్లి మండలం లాలంకోడూరు గ్రామంలో నివసిస్తున్నారని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

లాటరీల పేరుతో టోపీ!

- సుమారు రూ.10 లక్షలు వసూలు చేసి పరార్
- పలువురు గిరిజనుల ఆవేదన



లాటరీ పేరుతో పంపిణీ చేసిన కార్డుతో గిరిజనులు

చింతపల్లి: లాటరీల ద్వారా విలువైన వస్తువులు తక్కువ ధరకే లభిస్తాయని అమాయక గిరిజనులను నమ్మించారు. 17 వారాల పాటు నగదు జమ చేస్తే ఖరీదైన వస్తువులు రూ.10 వేలలోపే దక్కుతాయంటూ నమ్మబలికారు. మొదట్లో రూ.వంద, రెండు వందలు కట్టిన గిరిజనులకు కుక్కర్లు, కళాయిలు అందించారు. ఫ్రిజ్‌లు, కలర్ టీవీలు, ద్విచక్ర వాహనాలు, ఎయిర్‌కులర్‌లు, డబల్ కాట్ మంచాలు వంటివి పలకాలంటే ఒకేసారి రూ.ఐదు నుంచి పది వేలు చెల్లించాలని ఆశ చూపించారు. దీంతో మండలంలోని మేడూరు, తురుతుంపాడు, పిసిరిమామిడి, చింతలూరు, పోతురాజు గున్నల తదితర గ్రామాలకు చెందిన సుమారు 180 మంది గిరిజనులు దాదాపు రూ. పది లక్షల వరకు చెల్లించారు. ఒక్కొక్కరూ ఐదు నుంచి రూ.పదివేల వరకు చెల్లించారు. అయితే నెలలు గడుస్తున్నా లాటరీ వ్యక్తుల జాడ కన్పించలేదు. వారిచ్చిన నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని చెబుతుండడంతో తాము మోసపోయినట్టు గ్రహించి లబోదిబోమన్నారు. బాధితులు జరిగిన మోసాన్ని శనివారం విలేకరులకు తెలిపారు. శ్రీ లక్ష్మీనరసింహ ఎంటర్‌ప్రైజెస్ లక్కీ డ్రా పేరుతో కొందరు వ్యక్తులు ఒక్కో వ్యక్తి రూ.10 నుంచి రూ.650 వరకు 17 వారాల పాటు నగదు చెల్లిస్తే విలువైన వస్తువులు మీ సొంతం అవుతాయంటూ ప్రచారం చేశారని, పలు గ్రామాల్లో సభ్యులను చేర్చుకుని సభ్యత్వ కార్డులు కూడా అందజేశారని తెలిపారు. ఇది నమ్మి పలువురు గిరిజనులు కూలి చేసి సంపాదించిన సొమ్ము చెల్లిస్తే మొదట్లో కొందరికి కొన్ని వస్తువులు ఎర వేసి, తరువాత ఒకేసారి పెద్ద మొత్తంలో చెల్లిస్తే విలువైన వస్తువులు వస్తాయని ఆశ చూపారని, కానీ డబ్బులు చెల్లించాక వారి జాడ లేదని తెలిపారు. జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పిసిరిమామిడికి చెందిన పాంగి శేఖర్, కోర్ర జీవిత, పాంగి నాగమ్మ తెలిపారు.

రూ.96 వేల నగదు మాయం

మునగపాక: పూడిమడక రోడ్డులో బైక్‌పై ప్రయాణిస్తున్న వాహనదారు బ్యాగ్ నుంచి రూ.96 వేలు మాయం కావడంపై మునగపాక పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన సూరిబాబు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం ఉదయం తన బైక్‌పై తిమ్మరాజుపేటకు బయలుదేరారు. తన తల్లికి మామిడిపండ్లతో పాటు రూ.96వేల నగదు ఇచ్చేందుకు బ్యాగ్‌తో వస్తున్నాడు. పూడిమడక రోడ్డు గోతులమయంగా ఉండడంతో బైక్‌కు తగిలించిన బ్యాగ్ తెగిపోయింది. విషయం తెలియని సూరిబాబు ఇంటికి వెళ్లి చూసేసరికి బ్యాగ్ కనిపించకపోవడంతో కంగారు పడి వెతకడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా తిమ్మరాజుపేట మార్గంలో బ్యాగ్ ఒకరికి దొరికిందని తెలుసుకొని వాకబు చేస్తే మామిడిపండ్లు తప్ప అందులో నగదు కనిపించలేదు. దీంతో మునగపాక పోలీసులకు సూరిబాబు ఫిర్యాదు చేశారు. అనుమానితులను పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఆటోలో వృద్ధురాలి నుంచి రూ.60 వేలు చోరీ

రావికమతం: జె.నాయుడుపాలెం నుంచి కొత్తకోట ఆటోలో వస్తున్న ఒక వృద్ధురాలి నుంచి రూ.60 వేల నగదును కాజేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు కొత్తకోట ఎస్ఐ విభీషణరావు శనివారం తెలిపారు. వివరాలివి. రోలుగుంట మండలం కసిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన శింబోయిన వరహాలమ్మ(60) శనివారం కొత్తకోట బ్యాంకులో జమ చేయడానికి రూ.60వేల నగదును బ్యాగులో పెట్టుకుని ఆటో ఎక్కారు. ఆ ఆటోలో అప్పటికే ఇద్దరు గుర్తు తెలియని మహిళలు ఉన్నారు. వృద్ధురాలితో మాటామాటా కలిపి బ్యాగును సాయం చేస్తామంటూ పట్టుకుని తెలివిగా అందులో నగదును కాజేశారు. ఆ బ్యాగును మరలా వరహాలమ్మకు ఇచ్చేశారు. వరహాలమ్మ కొత్తకోటలో ఆటో దిగి బ్యాంకుకు వెళ్లి నగదు కట్టేందుకు బ్యాగు చూడగా అందులో నగదు లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన వ్యాన్

ప్రమాదంలో కూలీ మృతి



మృతి చెందిన చిటికెల వరహాలబాబు

యలమంచిలి: ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఐషర్ వ్యాన్ ప్రమాదంలో ఒక కూలీ మృతి చెందినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం గ్రామం హైవే రోడ్డుపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా కోటనందూరు మండలం గ్రామానికి చెందిన చిటికెల వరహాలబాబు (47)మృతి చెందినట్టు తెలిపారు. కోట నందూరునుంచి ట్రాక్టర్‌లో కర్రలు లోడుతో అచ్యుతాపురం వెళుతుండగా తుని నుంచి అతివేగంగా వచ్చిన వ్యాన్ ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో డ్రైవర్ పక్కన ఉన్న చిటికెల వరహాలబాబు ట్రాక్టర్ నుంచి జారి పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కుమారుడు చిటికెల సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్తకోట సామిల్లుపై డీఎఫ్‌వో దాడి

- రూ.25 వేల కలప స్వాధీనం
- కేసు నమోదు



సామిల్లులో అనుమతులు లేకుండా ఉన్న కలపను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో రాజారావు

రావికమతం: అనకాపల్లి డీఎఫ్‌వో రాజారావు కొత్తకోట గ్రామంలోని మణికంత సామిల్లులో శనివారం దాడులు చేశారు. ఆ సామిల్లులో అనుమతులు లేకుండా కలపను భారీ ఎత్తున నిల్వ చేస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో డీఎఫ్‌వో రాజారావు సిబ్బందితో ఆ సామిల్లును తనిఖీ చేశారు. రూ.25వేల విలువ గల టేకు, గన్నెర, పాసి కలప ఉన్నట్టు గుర్తించారు. ఆ కలపను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు డీఎఫ్‌వో రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. సా మిల్లులు అనుమతులు లేని కలపను కటింగ్ చేయరాదని, మిల్లుల్లో నిల్వ చేయడం కూడా నేరమేనని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక అటవీ సెక్షన్ అధికారి నూకరాజు పాల్గొన్నారు.

టేకు కలప రవాణాలో అవకతవకలు అవాస్తవం

గొలుగొండ: టేకు కలప రవాణాలో ఎటువంటి అవకతవకలు జరగలేదని నర్సీపట్నం డీఎఫ్‌వో రాజారావు తెలిపారు. మండలంలోని కృష్ణదేవిపేట పరిధిలో పర్మిట్లు మంజూరైన టేకు కలపను ఆయన శనివారం పరిశీలించారు. కృష్ణదేవిపేటకు చెందిన వ్యక్తులు అనుమతులు లేకుండా టేకు కలపను రవాణా చేస్తున్నట్టు శుక్రవారం అందిన ఫిర్యాదు మేరకు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. జిరాయితీ భూముల్లో టేకు చెట్లను రైతుల వద్ద వ్యాపారులు కొనుగోలు చేసుకుని, వాటి రవాణాకు అనుమతులు కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వాల్టా చట్టం ప్రకారం చెట్ల రవాణాకు తహసీల్దార్ అనుమతులు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కృష్ణదేవిపేట రేంజర్ వెంకట్రావు, డిప్యూటీ రేంజర్ రాజేష్, గొలుగొండ సెక్షన్ అధికారి లక్ష్మణ్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోపై జేసీబీ ఆపరేటర్ దాడి



స్వాధీనం చేసుకున్న జేసీబీ

రాంబిల్లి: మండలంలోని పంచదార్ల గ్రామంలో శనివారం వీఆర్వో ఆర్.జగన్నాథరావుపై జేసీబీ ఆపరేటర్ దాడి చేశాడు. అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు వీఆర్వో సంఘటన స్థలానికి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీశారు. ఆ సమయంలో జేసీబీ ఆపరేటర్ వీఆర్వోపై దాడి చేశాడు. దీనిపై తహసీల్దారు పి.భాగ్యవతికి వీఆర్వో ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ చేసిన ఆమె, జేసీబీ ఆపరేటర్ పై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ దీనబంధును ఆదేశించారు.జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఉంచామని, ఆపరేటర్ పై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

దుకాణాలు, కల్యాణమండపం లీజుకు బహిరంగ వేలం

అనకాపల్లిటౌన్: జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణమండపం, చేపల బజారును లీజు పద్ధతిలో ఇచ్చేందుకు ప్రతీ బుధవారం ఉదయం 11 గంటలకు జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు జెడ్సీ పి.వెంకటరమణ శనివారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు కళ్యామండపానికి ధరావత్తుగా రూ.3లక్షలు, చేపలబజారుకు రూ.44వేలు ముందుగా జీవీఎంసీ కమిషనర్ పేరుమీద డీడీ తీసుకుని, వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జోన్‌కార్యాలయంలో సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

వాసవీ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన ప్యాకెట్ల పంపిణీ



ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్న కడిమిశెట్టి సతీష్, గణపతి

అనకాపల్లిటౌన్: వాసవీ స్వయంసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక పూడిమడక రహదారిలో భోజన ప్యాకెట్లు, మజ్జిగ, చెరుకురసం, లస్సీ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసవీ స్వయంసేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు కడిమిశెట్టి సతీష్, చైర్మన్ బత్తుల గణపతి మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏడాది పాటు నిరుపేదలకు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో ఈనెలాఖరువరకు చలివేంద్రాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బిళ్లపాటి కృష్ణకుమార్, నుదిటిపాటి తాతాజీ, శ్రీధరాల మనోజ్, ప్రకాష్ గుప్తా, వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గైపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

నాతవరం: గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి తెలిపారు. చమ్మచింతలో రూ.10 లక్షలతో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతోపాటు గ్రామస్తుల సహకారంతో ఆలయం నిర్మించామన్నారు. దీన్ని సర్వాంగ సుందరంగా తయారు చేసి ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో ప్రారంభిస్తామన్నారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
అన్‌స్టాపబుల్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 50 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,750	4,750
రెండో రకం	4,000	4,450
మూడో రకం	3,600	3,910

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 23 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. బి పాజిటివ్-5 యూనిట్లు, ఒ పాజిటివ్-15 యూనిట్లు, ఎ నెగిటివ్-1 యూనిట్, బి నెగిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 302 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 194 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

బడికి వేళాయె



గురజాడనగర్‌లో పాఠశాల



జగనన్న విద్యాకానుక కిట్

శిథిల భవనాలు... పెచ్చులూడిపోతున్న గచ్చులు, విరిగిపోయిన ఫర్నిచర్, ట్యాప్‌లు ఊడిపోయిన కొళాయిలు... ఇది గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల దుస్థితి.. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల తీరు పూర్తిగా మారిపోయింది. నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలలన్నింటినీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పూర్తి సౌకర్యాల మధ్య పునఃప్రారంభానికి పాఠశాలలు సిద్ధమవుతున్నాయి. ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక కిట్లు, కొత్త పుస్తకాలు అందజేయనున్నారు.

- 12న పాఠశాలలు పునఃప్రారంభం
- బడి ప్రారంభం రోజే జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ
- ఏర్పాట్లు చేసిన అధికారులు

తుమ్మపాల: వేసవి సెలవుల అనంతరం ఈనెల 12న పాఠశాలల పునఃప్రారంభానికి విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో విప్లవాత్మక మార్పులు, ఆధునిక హంగులతో పూర్తిస్థాయిలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. పాఠశాల ప్రారంభం రోజే జగనన్న విద్యాకానుక కిట్లు, పాఠ్యపుస్తకాలు అందించేందుకు సిద్ధం చేశారు. నియోజకవర్గంలో 1 నుంచి 10వ తరగతి వరకు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 4,519 మంది ఉన్నారు. వీరందరి కోసం స్టాక్ పాయింట్ల నుంచి అన్ని పాఠశాలలకు వాహనాల ద్వారా శతశాతం కిట్లను ఇప్పటికే తరలించారు. ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ కూడా ముగియడంతో ఆయా పాఠశాలకు లెక్క ప్రకారం ఉపాధ్యాయులు రానున్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపారు. దీంతో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుతో పాటు ఇంగ్లిష్, డిజిటల్ బోధనను ప్రభుత్వం అమలు చేస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు కూడా ఆసక్తి చూపారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా పాఠశాలలు

మండలం	ప్రాథమిక	ఉన్నత	విద్యార్థులు
అనకాపల్లి	45	16	2,650
కశింకోట	36	10	1,869

ఆదర్శ-1, కస్తూర్బా-1, గురుకుల-2 ఉన్నాయి.



అందంగా రూపొందిన ప్రభుత్వ పాఠశాల

అన్ని పాఠశాలలకు కిట్లు



మండల కేంద్రంలో స్టాక్‌చేసిన జీవీకే కిట్లు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా అన్ని పాఠశాలకు చేరుస్తున్నాం.ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలు తెరచిన రోజే విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకున్నాం. ప్రతి విద్యార్థికి ఈ కిట్ అందిస్తున్నాం. కిట్లు రవాణా, ప్యాకింగ్‌కు ప్రత్యేకంగా నిధులు వెచ్చించాం
– డి.దివాకర్, ఎంఈవో, అనకాపల్లి మండలం

గ్రామీణ ప్రాంత రోగులకు మెరుగైన వైద్యం

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి



అత్యవసర విభాగంలో బాలికను పరీక్షిస్తున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, వైద్యుడు జి.రామ్మూర్తి అన్నారు. ఆయన శుక్రవారం రాత్రి ఆస్పత్రిని సందర్శించారు. అత్యవసర విభాగం, వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఎక్కువ మంది అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చే వారికి సకాలంలో వైద్య సేవలందించి వారి మన్ననలు పొందాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోడ్డు ప్రమాదాలు, కొట్లాటల్లో గాయపడిన వారికి వెంటనే వైద్యసేవలందించడంతో పాటు సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని తెలిపారు. ఆస్పత్రిలో అన్నివిభాగాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాలయం వైద్యుడు గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాల అభివృద్ధికి సహకారం



ప్రమాణం చేస్తున్న పూర్వ విద్యార్థుల సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

- పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు

అనకాపల్లి రూరల్:కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థులు తెలిపారు. శనివారం స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం ఎన్నికైన కొత్త కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.సంఘ కార్యాలయాన్ని ప్రారంభించిన తర్వాత కళాశాల ఆవరణలో గల వ్యవస్థాపకుడు కోరుకొండ లింగమూర్తి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పెంటకోట అనూరాధ,పాలకవర్గ సభ్యుడు వాసిరెడ్డి బాలకృష్ణ,విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్ నూకరాజు,బొండాడ రాజు, ఉప తహసీల్దారు సింగంపల్లి వాసు, నిరుజ్జోగి నరసింహమూర్తి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గం

ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గానికి అధ్యక్షుడిగా బొడ్డేడ అప్పారావు,ఉపాధ్యక్షులుగా కె.ఎస్.ఎస్. శర్మ, పి. రాజేశ్వర ప్రసాద్, కోరిబిల్లి లావణ్య,కార్యదర్శిగా పెనుమత్స కృష్ణంరాజు,సహాయ కార్యదర్శులుగా గుర్రం ప్రసాద్,కొణతాల రాజేంద్ర ప్రసాద్,ఐ.ఆర్. గంగాధర్, కోశాధికారిగా వై.జగదీశ్వరరావు,ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొల్లూరు మంగరాజు,దాడి శ్రీనివాసరావు,గల్లా జయబాబు,పి.అనూరాధ,కార్యవర్గ సభ్యులుగా బుద్ద కాశీ విశ్వేశ్వరరావు,కె.ఎస్.వి.సత్యనారాయణ, సీహెచ్ రామచంద్రరావు, బి.ఎస్. సాగర్, కె. రామచంద్రరావు,కె.వి.ఎస్. నాయుడు,జి.పెంటాద్రి రావు,బి.వి. కన్నారావు,టి.సూర్యకళ,ఎ.అమ్మాజీ ఎన్నికయ్యారు.

20న జగన్నాథుని రథోత్సవం



జగన్నాథస్వామి రథోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: జగన్నాథస్వామి రథోత్సవాన్ని ఈనెల 20న నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. స్థానిక గూడ్స్‌రోడ్డు రహదారిలో ఇంద్రద్యుమ్న హాలులో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు రథోత్సవాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి ప్రారంభించనున్నట్టు ఆయన చెప్పారు. ఈనెల19వ తేదీ రాత్రి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. గవరపాలెం నుంచి గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్నహాలు వరకు రథోత్సవం జరుగుతుందన్నారు. అక్కడ స్వామివారు తొమ్మిది రోజులపాటు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 29వ తేదీ సాయంత్రం 4 గంటలకు స్వామివారు తిరుగురథోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో 80, 81 వార్డుల ఇన్‌చార్జిలు కొణతాల భాస్కర్, పీలా రాంబాబు, దేవాలయం ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు యల్లపు చంద్రమోహన్, దాడి ఈశ్వరరావు, శిలపరశెట్టి బాబి, కాంగ్రేడుల శ్రీరామ్, వియ్యపు శ్రీనివాస్‌యాదవ్, విల్లూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వడగాడ్పులతో అవస్థలు



నూతలగుంటపాలెం వద్ద బోసిపోయిన జాతీయ రహదారి

కశింకోట: సూర్యుడు నిప్పులు చెరగడంతో మండల ప్రజలు అల్లాడిపోయారు. ఎన్నడూ లేని విధంగా శనివారం తీవ్రంగా వడగాడ్పులు వీచాయి. ఉదయం నుంచే వడగాడ్పులు వీయడంతో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఎండ వేడిమిని భరించలేక బయట తిరగడానికి ఎవరూ సాహసించలేదు. దీంతో రహదారులు జన సంచారం లేక బోసిపోయాయి.

విత్తనాల కోసం ఆర్బీకేల్లో జోరుగా నమోదు



రోలుగుంట ఆర్బీకేలో పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

రోలుగుంట: ఖరీఫ్ సాగు కోసం ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందించేందుకు చేపట్టిన నమోదు ప్రక్రియ మండలంలో జోరుగా సాగుతోంది. ఈ సందర్భంగా రోలుగుంటలో ఎంపీఈవో వాణి రైతులకు కావాల్సిన వరి రకాన్ని బట్టి నగదు తీసుకుని ఆధార్ కార్డు వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏవో ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు ఏటా మాదిరిగానే ఆర్‌జేఎల్ రకానికి డబ్బులు చెల్లిస్తున్నారన్నారు. రైతులు కోరిన అన్ని రకాల విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు.

13న ఉమ్మలాడలో పోతురాజుబాబు పండగ

- పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కన్నబాబు



పోతురాజుబాబు పండగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : గ్రామీణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) కోరారు. ఉమ్మలాడలో ఈ నెల 13న జరగనున్న పోతురాజుబాబు పండగను ఘనంగా జరుపుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సాంస్కృతిక ప్రదర్శనల విషయంలో చట్టాలను గౌరవిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, సర్పంచ్ గంగయమ్మ, ఉప సర్పంచ్ రాము, నారాయణరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు



బైకల చోరీపై ఎస్‌ఐని కలిసిన నక్కపల్లి నాయకులు

నక్కపల్లి : ఉపమాక రోడ్డులో రెండురోజుల క్రితం ఒక మోటార్ సైకిల్ చోరీకి గురైంది. టీవీ చానల్ విలేకరిగా పనిచేస్తున్న ముద్దా రాజు తన హోండా షైన్ మోటారు సైకిల్‌ను ఇంటి ముందు పార్క్ చేయగా తెల్లవారుజామున చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇటీవల కాలంలో వరుసగా బైక్ దొంగతనాలు జరుగుతుండడంపై శనివారం ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు ఎస్‌ఐ శిరీషను కలిసి ఆమె దృష్టికి తీసుకొచ్చారు. చోరీలపై గట్టి నిఘా పెట్టి బైకు దొంగలను పట్టుకోవాలని కోరారు. తమకు అందిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి, చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్‌ఐ శిరీష తెలిపారు.

శీలప్పన్న చెరువు సుందరీకరణ పనుల పరిశీలన



నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : మునగపాక గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. మునగపాకలోని శీలప్పన్న చెరువు పనులతో పాటు మార్కెట్ అభివృద్ధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువును ఆనుకొని పూరిపాకల్లో నివాసం ఉంటున్న నలుగురు నిరుపేదలకు పట్టాలు అందజేశారు. ఆయన వెంట ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు

దేవరాపల్లి: ఎం. అలమండలో గణపతి సహిత సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ, షిర్డీ సాయినాథ విగ్రహ, ధ్వజ స్తంభ సహిత శిఖర ప్రతిష్ట మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఆవరణలో జరిగిన హోమాల్లో పాల్గొని జై శ్రీరామ్ జై శ్రీరామ్ నామ స్మరణంతో తరించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పోతల లక్ష్మీశంకర్, సర్పంచ్ దాడి జగన్ ఆయనకు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రాకుల గంగాభవానీ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పోతల నానాజీ, బొడ్డు రాధాకృష్ణ, ఎంపీటీసీ పోతల వెంకటరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బండారు ప్రసాదరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

అనకాపల్లిటౌన్: సీపీఎస్ పేరును మార్చి జీపీఎస్‌గా అమలు చేసేందుకు యత్నించడం అన్యాయమని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. శనివారం స్థానిక నెహ్రూచౌక్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్షతగ్రాతుడికి ఆర్థిక సాయం

దేవరాపల్లి: చెట్టు మీద నుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన నిరుపేద యువకుడు బర్ల దేముడుబాబుకు స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సంస్థ ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకుంది. కె.కోటపాడు మండలం సంతపాలెంకు చెందిన అతడు వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్నేహాంజలి ఫర్ పూర్ సంస్థ సభ్యులు మారేపల్లిలోని మేనత్త ఇంట్లో ఆశ్రయం పొందుతున్న బాధితుడిని శనివారం పరామర్శించారు. ఆర్గనైజేషన్ తరపున రూ.10 వేలు అందజేసి బాసటగా నిలిచారు. సంస్థ సభ్యులకు ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ సంస్థ ప్రతినిధి మచ్చ వీర్రాజు, సభ్యులు జి. సంతోషి నళిని, త్రినాథ్, గోవింద, గోకాడ ఉపేంద్ర పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధితో భూగర్భ జలాల పెంపు



పి.భీమవరంలో చెరువు పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి పార్థసారథి

బుచ్చెయ్యపేట: చెరువులను అభివృద్ధి చేయడం వల్ల భూగర్భ జలాలు పెరగడంతోపాటు రైతులకు పుష్కలంగా సాగు నీరు అందుతుందని జిల్లా ప్రత్యేకాధికారి పార్థసారథి తెలిపారు. అమృత సరోవర్ చెరువులు అభివృద్ధి పథకంలో భాగంగా పి.భీమవరంలోని సోమరాజు చెరువు, పెదమదీనలో తివ్వకొండ చెరువు పనులను ఆయన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. చెరువులు అభివృద్ధి కోసం నిధుల వినియోగం, పనుల రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు ఉపయోగపడేలా, కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించేలా చెరువులను అభివృద్ధి చేయాలని సూచించారు. రెండు గ్రామాల్లో చెరువుల పనులు సంక్రమంగా చేయడంపై మండల అధికారులను అభినందించారు. సర్పంచ్‌లు పినపోలు రామునాయుడు, కేవీఆర్ నాయుడు, పీడీ శ్రీనివాస్, ఏపీవో మురళీకృష్ణ, ఈసీ నితీష్‌కుమార్, కొండాజీ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం



కల్యాణోత్సవంలో భక్తులు

గొలుగొండ: ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జానకీరాంపురంలో సీతారామల కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయాన్ని నిర్మించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంతోపాటు నర్సంగబిల్లి, పప్పుశెట్టిపాలెం, జోగుంపేట, గొలుగొండ గ్రామాల భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకండా కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించండి

కోటవురట్ల : జగనన్న స్వచ్ఛ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవాని కోరారు. కె.వెంకటాపురంలో శనివారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. శ్మశాన వాటిక, జెడ్పీ హైస్కూల్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. వీధుల్లో పేరుకున్న చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవడానికి సమష్టి కృషి అవసరం అన్నారు.

జంగిల్ క్లియరెన్సు చేపట్టరూ...



నీలిగుంట వెళ్లే మార్గంలో తుప్పలు

కోటవురట్ల : గ్రామీణ రహదారులు ఇరువైపులా పిచ్చిమొక్కలతో నిండిపోయి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చాలా కాలంగా జంగిల్ క్లియరెన్సు చేయించకపోవడంతో ఇరుకు రోడ్లలో ఎదురెదురు వాహనాలు కనిపించక ప్రమాదాలకు కారణమవుతోంది. నీలిగుంట, భీమిరెడ్డిపాలెం, పాములవాక, రాజుపేట, లింగాపురం–కొడవటిపూడి రహదారుల్లో ఈ పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్సు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.